# ఎమ్మెల్సీ కవితను కలిసిన నేతలు


ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా'


కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కాపు సీతాలక్ష్మి, నాయకులు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 15: ఖమ్మం పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ కవితను అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

టేకులపల్లి, ఫిబ్రవరి 15: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ కలిశారు. బీఆర్ఎస్ నాయకులు లక్కినేని సురేందర్, ఎస్టీ సెల్ నాయకుడు భూక్యా రాజాను అక్రమంగా కేసు పెట్టి జైల్లో ఉంచిన విషయం తెలుసుకుని వారిని పరామర్శించడానికి వచ్చిన కవితకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. వారి వెంట బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, కుమ్మరి కిరణ్, లక్కినేని సాయి, హరిప్రసాద్, జాఫర్ ఉన్నారు.

రామవరం, ఫిబ్రవరి 15: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ, కూసన్ వీరభద్రం, వాసికర్ల కిరణ్ కుమార్, ఈ.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# ఆభరణాల దొంగ అరెస్ట్

## 11 తులాల బంగారు నగలు స్వాధీనం


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 15: ఆభరణాల దొంగను లక్ష్మీదేవిపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 11 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. ఈ మేరకు ఈ కేసు వివరాలను లక్ష్మీదేవిపల్లి పీఎస్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రహమాన్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని శ్రీనగర్ పంచాయతీ పరిధిలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న చిలక పద్మావతి అనే ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ నెల 8న ఇంట్లో 11 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఆదేశాలతో ఎస్సై రమణరెడ్డి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటుగా వస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించడంతో అతడిని ఆపి తనిఖీ చేయబోయారు. ఇంతలో అతడు తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. తన వద్ద బంగారం ఉందని చెప్పాడు. అనంతరం అతడిని విచారించగా.. ఈ నెల 8న చిలక పద్మావతి ఇంట్లో దొంగతనం చేసినట్లు చెప్పారు. నిందితుడిని పాల్వంచ వనమా కాలనీకి చెందిన ధరంసోత్ మాన్‌సింగ్‌గా గుర్తించారు. అతడి వద్ద 11 తులాల ఆభరణాలను రికవరీ చేశారు. మాన్‌సింగ్‌పై గోదావరిఖనిలో 6, పాల్వంచలో 13, ఎన్‌టీపీసీ జీడీకేలో ఒకటి కలిపి మొత్తం 20 దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమణారెడ్డి, రామారావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్స్‌ను పట్టించుకోని ప్రభుత్వం

చంద్రుగొండ, ఫిబ్రవరి 15: ప్రభుత్వ హాస్టల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విచారకరమని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ విమర్శించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ వసతి గృహాలను పరిశీలించి ఇటీవల ఎలుకల దాడిలో గాయపడ్డ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## సహజ యోగ ధ్యానంతో ప్రశాంతత

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 15: సహజ యోగ ధ్యానంతో ప్రశాంతత సాధ్యమవుతుందని, మనల్ని సృష్టించిన దైవశక్తితో అనుసంధానం చేసే పరిపూర్ణ ప్రక్రియ అని సహజ యోగ తెలంగాణ ట్రస్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ గౌరీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ట్రస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు సుప్రజ, జిల్లా ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్ అశ్విన్, కమిటీ సభ్యులు అమర్‌సింగ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అశ్వారావుపేట (ములకలపల్లి), ఫిబ్రవరి 15: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి మండలం పాలవాగు నుంచి కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అమరుల ఆశయాలను కొనసాగిద్దాం : సీపీఎం

దమ్మపేట, ఫిబ్రవరి 15: ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి అమరులైన ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ముష్టిబండలో సీపీఎం నాయకులు ఉడతనేని వెంకట్రావు వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే పార్టీ సీపీఎం అని గుర్తు చేశారు.

## బాధిత కుటుంబానికి చేయూత

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 15: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాధితుడి కుటుంబానికి మండల మున్నూరు కాపు సంఘంతో పాటు పలువురు అండగా నిలిచారు. వాట్సాప్ గ్రూప్ సాహాయంతో ఆర్థిక సహాయాన్ని అందజేసిన రూ.50 వేలు నగదును శనివారం గాయపడిన మన్యం శివ కుటుంభ సభ్యులకు పట్టణంలోని చిన్నంశెట్టి బజారులోని ఆయన ఇంటివద్ద అందజేశారు. చిన్నంశెట్టి సత్యనారాయణ, కురిశెట్టి నాగబాబు, కట్టా శ్రీనివాసరావు, పసుపులేటి రామస్వామి, గుండెపునేని ఉపేంద్రరావు, చిక్కం గోపాలకృష్ణ, మట్లకుంట కామేశ్వరావు, తిరుమలశెట్టి అప్పారావు, శెట్టిపల్లి రఘురామ్, తిరునాటి సంజయ్, కర్నాటి నాగేశ్వరావు, స్నేహిత్, సాయి, మనోజ్ ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# కంటి చికిత్స శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

## ఐటీడీఏ పీవో రాహుల్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 15: ప్రతిఒక్కరికీ చూపు ఇవ్వాలనే లక్ష్యంతో లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల సభ్యులు భద్రాచలంలో నేత్ర చికిత్సా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శనివారం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాల ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం ముగింపు కార్యక్రమానికి పీవో హాజరై మాట్లాడారు. నర్సింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొని గిరిజనులకు సేవలందించాలన్నారు. ఉచిత నేత్రచికిత్సా శిబిరంలో గతంలో ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతులమీదుగా ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

**అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి**

భద్రాచలం, ఫిబ్రవరి 15: ఆదివాసీ గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బృందం సభ్యులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మారుమూల గ్రామాల్లో గల గిరిజన కుటుంబాల మౌలిక వసతుల కల్పనకు అధ్యయనం చేయడానికి వచ్చిన భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బృందం సభ్యులతో తన చాంబర్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు, గిరిజన పిల్లల కోసం విద్య, వైద్యం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ ద్వారా నిధులు మంజూరు చేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో సంక్షేమ శాఖ పాఠశాలలు, పీహెచ్‌సీలు, భద్రాచలం పట్టణంలో ఏరియా ఆసుపత్రి, ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను సందర్శించినట్లు బృందం సభ్యులు పీవోకు తెలిపారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ జీఎం శ్రీనివాస్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

# సేవాలాల్ సేవలు ఎనలేనివి

సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో వక్తలు

**బంజారా జాతికి సంత్ సేవాలాల్ మహరాజ్ చేసిన సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. బంజారాల అభ్యున్నతి కోసం ఆయన అహర్నిశలూ కృషి చేశారని గుర్తుచేశారు. శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఆయా బంజారా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సేవాలాల్ ఆశయాలను సాధించేందుకు బంజారాలందరూ కృషిచేయాలని కోరారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు చేశారు. పాల్వంచలో జరిగిన వేడుకల్లో టీజీ జెన్కో డైరెక్టర్ (థర్మల్) లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలో గ్రీన్ ఎర్త్ సొసైటీ ఆధ్వర్యంలోనూ సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. -నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 15**


భద్రాచలం : జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న ఆర్డీవో దామోదర్‌రావు


టేకులపల్లి : దంతెలతండాలో కోరం కనకయ్య, మాజీ సర్పంచ్ ఉమ


పాల్వంచ రూరల్ : పాండురంగాపురంలో సేవాలాల్ జయంతి వేడుకలు


అశ్వారావుపేట టౌన్ : భోగ్ బంగారో వేడుకల్లో బంజారా నాయకులు


పాల్వంచలో బంజారా భవన్‌లో పూజలు చేస్తున్న బంజారాలు

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

ఇల్లెందు, ఫిబ్రవరి 15: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్మిక సంఘాల సమైక్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగ పాణి అన్నారు. శనివారం ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఐఎఫ్‌టీయూ కమిటీ సభ్యుడు డి.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొక్కు సారంగపాణి మాట్లాడారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్‌పై ఉద్యమం

టేకులపల్లి, ఫిబ్రవరి 15: హామీలను విస్మరించిన కాంగ్రెస్‌పై ఉద్యమిద్దామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ నాయకులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లో జరుగు ప్రదర్శన పోస్టర్లు ఆవిష్కరించారు.

## పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో మహాలక్ష్మి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రదర్శించారు. మండలంలో 10 పంచాయతీల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం ఓటర్లు 16962 మంది ఉన్నారని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పినపాక, ఫిబ్రవరి 15: మండలంలోని సీతంపేట ఎస్సీ కాలనీకి చెందిన పూస వెంకటేష్‌కు చెందిన పూరిల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కట్టు బట్టలతో కుటుంబం ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అద్దంకి నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌ను రప్పించి మంటలను అదుపు చేయించారు. వెంకటేష్ కుటుంబానికి తహసీల్దార్ నరేష్ రూ.5వేలు, బీఆర్ఎస్ నాయకులు కొండేరు నాగభూషణ్, కొండేరు రాము, నిమ్మల వెంకన్న ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు.

## లంబాడీలకు ప్రత్యేక సెలవు ఇవ్వడం దుర్మార్గమైన చర్య

కరకగూడెం, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహారాజ్ పండుగ సందర్భంగా లంబాడీలకు ప్రభుత్వం ప్రత్యేక సెలవు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని ఆదివాసీ ఉద్యోగుల సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు పోలెబోయిన వెంకటనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి లేని ప్రత్యేకత సేవాలాల్ జయంతికి ఎందుకు ఇస్తున్నారని విమర్శించారు.

## మూడు పూరిళ్లు దగ్ధం

పర్ణశాల, ఫిబ్రవరి 15: మండలంలోని పెద్దనల్లబెల్లి గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. శనివారం ఇళ్లలోని వారు వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లడంతో మధ్యాహ్నం విద్యుదాఘాతంతో ఒక పూరింట్లో మంటలు చెలరేగి పక్కనే ఉన్న మరో రెండు పూరిళ్లకు అంటుకొని దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన కణితి నాగమణి, భూక్యా లక్ష్మణ్, అనిరెడ్డి వెంకన్నకు చెందిన మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మంటలను భద్రాచలం అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి అదుపులోకి తెచ్చారు. దుమ్ముగూడెం సీఐ అశోక్‌కుమార్, ఆర్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాదానికి గల పూర్తి వివరాలు సేకరించారు. బాధితులకు మాజీ సర్పంచ్ మట్ట శివాజీ నిత్యావసర సరుకులు, విజయవాడకు చెందిన పివి చారిటబుల్ ట్రస్టు వారు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## నేటి నుంచి కులగణన సర్వే

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 15: మండలంలో కులగణన సర్వేలో పేరు నమోదు చేయించుకోని కుటుంబాలకు ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు పేరు నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో మహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన సర్వేలో పేరు నమోదు 3 పద్ధతుల్లో చేయించుకోవచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ – 040– 21111111, మండల కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం, వ్యక్తిగతంగా దరఖాస్తులు నింపి మండల ప్రజాపాలన సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవచ్చని తెలిపారు.

## బయ్యారం ఉక్కు పరిశ్రమను నిర్మించాలి

ఇల్లెందు, ఫిబ్రవరి 15: బయ్యారం ఉక్కు పరిశ్రమను నిర్మించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు సీపీఎం ఆఫీసులో జరిగిన అఖిలపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఇల్లెందు నియోజక వర్గం బయ్యారంలో విభజన హామీలో భాగంగా ఉక్కు కర్మాగారం వెంటనే నిర్మించాలని బీజేబీ, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ఇల్లెందు, ఫిబ్రవరి 15: ఇల్లెందు పట్టణంలో వీధి వ్యాపారం చేస్తున్న వారికి జిల్లా సంక్షేమశాఖ అధికారిణి లెనినా స్వర్ణలత గొడుగులు పంపిణీ చేశారు. శనివారం ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఆమె పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి వ్యాపారం నిర్వహిస్తున్న వారికి ఎండ నుంచి రక్షణగా గొడుగులు అందజేశారు.

## న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 15: ఆరు గ్యారెంటీలు అమలు కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ న్యూడెమోక్రసీ నాయకులు శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇల్లెందు మండలంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల ఆధ్వర్యంలో పోలారం పంచాయతీ, బొంబాయితండా, కొమరారం ఎల్లాపురం, తొంటాబాలుతండా, మాణిక్యారం గ్రామాల్లో భారీ బైక్ ప్రదర్శన నిర్వహించారు.

## సమక్క- సారలమ్మ ఆలయంలో చోరీ

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని తిరుమలకుంట గ్రామ సమీపంలోని సమక్క సారలమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు నగదు చోరీ చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. శనివారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లగా బీరువా డోర్ తెరిచి ఉందని, దానిలోని సుమారు 50వేలు నగదు, రూ.20వేల విలువ గల వెండి ఆభరణాలు, సుమారు 10 పట్టుచీరలు చోరికి గురైనట్లు ఆలయ పూజారి వగ్గెల వెంకటేశ్వరావు పోలీసుకు వివరించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు.

## శ్మశాన వాటిక అభివృద్ధికి చేయూత

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోని భద్రాచలం రోడ్డులో ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు చేయి చేయి కలిపారు. శనివారం జేసీబీతో పనులు చేపట్టారు. బోరు, మోటార్, ట్యాంక్ నిర్మాణం, సిమెంట్ పోల్స్, చుట్టూ పెన్సింగ్ వంటి పనులు చేపట్టెందుకు నల్లపు నర్సింహారావు రూ.20వేలు, ఉప్పల ప్రసాద్ రూ.10వేలు, నల్లపు హరిప్రసాద్ రూ.10వేలు, శింగల దేవి శోభ రూ.5వేలు, ఉప్పల మురళీ రూ.5వేలు, రొయ్యల సత్యనారాయణ రూ.5వేలు, విన్నకోట శ్రీను రూ.10వేలు శనివారం నగదు అందించారని నిర్వహకులు సతీష్, హరిప్రసాద్ తెలిపారు.

## 18 వరకు టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన

చుంచుపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని చుంచుపల్లి ఉన్న త పాఠశాలలో పదో తరగతి ఇంట్నల్ మార్కులను ఎంఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. పదో తరగతి ఇంటర్నల్ మార్కుల కోసం ఉపాధ్యాయుల బృంద సభ్యులు ఈ నెల 18 వరకు మండలంలోని ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారని, ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తారని అన్నారు. మండలంలో దాదాపు ప్రభుత్వ పాఠశాలల్లో 170 మంది విద్యార్థులు టెన్త్ చదువుత్నుట్లు చెప్పారు. హెచ్ఎం, వెరిఫికేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో మాస్టర్ ప్లాన్ సర్వే ప్రారంభం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 15: పట్టణాభివృద్ధికి, పెరగుతున్న జనాభాకు అనుగుణంగా రాబోయే 30 ఏళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సర్వే చేపడుతున్నట్లు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ తిరునరి శేషాంజనస్వామి తెలిపారు. ఈ క్రమంలో పాత కొత్తగూడెంలో శనివారం ఈ మాస్టర్‌ప్లాన్ సర్వేను ప్రారంభించారు. బుధవారం వరకు ఈ సర్వే జరుగనున్నట్లు చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారి మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సర్వే ఆఫ్ ఇండియా టెక్నికల్ అధికారి బుర్ర గోపాల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, ఫిబ్రవరి 15: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టొచ్చు: ఎస్పీ

కొత్తగూడెం ప్రగతిమైదాన్, ఫిబ్రవరి 15: సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడం వల్ల నేరాలను అరిట్టే అవకాశం ఉందని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. జిల్లాలోని పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. చోరీల నివారణకు, రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానే ఉపయోగపడతాయని అన్నారు. ఇప్పటికే నమోదైన చాలా కేసుల్లో సీసీ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు.

## మొక్కలు నాటిన నాయకులు


మొక్కలు నాటుతున్న భావ్‌సింగ్‌నాయక్, నాయకులు

ఇల్లెందు, ఫిబ్రవరి 15: గులాబీ బాస్ పుట్టిన రోజు పురస్కరించుకొని పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్క నాటాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీర భావ్‌సింగ్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. శనివారం ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం పంచాయతీలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేసీఆర్ పుట్టిన రోజుకు రెండు రోజుల ముందునుంచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో 15 మొక్కలు నాటామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు భూక్యా సురేష్, బానోత్ రామదాసు, రాజు, విమల, రవీందర్, సంతోష్, రాహులు, వంశీ, చరణ్, గురు, ప్రేమ్, రాము పాల్గొన్నారు.

## '20న చలో విద్యుత్ సౌధ'

పాల్వంచ, ఫిబ్రవరి 15: విద్యుత్ రంగంలో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్లను కర్వర్షన్ చేయాలని కోరుతూ ఈ నెల 20న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టిజన్ల సంఘం జేఏసీ తెలిపారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను శనివారం పాల్వంచ కేటీపీఎస్‌లో ఆవిష్కరించారు. కేటీపీఎస్ నుంచి ఆర్టిజన్లందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## సింధుకు కలెక్టర్ అభినందన


సింధును అభినందిస్తున్న కలెక్టర్

పాల్వంచ, ఫిబ్రవరి 15: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఫిబ్రవరి 9న జరిగిన జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో 4x100 రిలే విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిన భద్రాద్రి జిల్లా క్రీడాకారిణి మాలోత్ సింధును కలెక్టర్ జితేశ్ వి పాటిల్ శనివారం అభినందించారు. క్రీడాకారిణి సింధు కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్‌ను మర్యాపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సింధును కలెక్టర్ సత్కరించారు. జిల్లాకు గుర్తింపు తెచ్చిన సందర్భంగా రూ.25 వేల చెక్కును అందజేశారు. సింధును ప్రోత్సహించిన తల్లిదండ్రులను, కోచ్‌లను కలెక్టర్ అభినందించారు. జిల్లా అధికారులు పరంధామరెడ్డి, కే.మహేందర్, మల్లికార్జున్, ఒలిపింక్ సభ్యులు యుగంధర్ రెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌రంగ సమస్యలపై ఎన్పీడీసీఎల్ సీఎండీకి వినతి


టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

పాల్వంచ, ఫిబ్రవరి 15: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిని హైదరాబాద్‌లో శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు కోడూరి ప్రకాశ్, కేవీ జాన్సన్, చారుగుండ్ల రమేశ్ తదితరులు మాట్లాడారు. బిల్ కలెక్టర్ల వేతనాలు పెంచాలని, అన్ మ్యాన్డ్ వర్కర్లకు జేఎల్ఎం రిక్రూట్‌మెంట్‌లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఎన్పీడీసీఎల్ సెక్యూరిటీ గార్డులకు సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు కరెంటురావు, దేవేందర్‌రెడ్డి, మునిందర్, నరేంద్రపాల్, అజీజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై వినతి

పాల్వంచ, ఫిబ్రవరి 15: ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–1104 కార్మిక సంఘం ఆధ్వర్యంలో టీజీ జెన్కో డైరెక్టర్ (థర్మల్) లక్ష్మయ్యకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కేశబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ఈపీఎఫ్, జీపీఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని, కేటీపీఎస్ ఏడో దశ పీఎల్ఎఫ్ కల్పించాలని, తొలగించిన పాత ప్లాంట్ స్థానంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో నూతన ప్లాంట్ నిర్మించాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం

రామవరం, ఫిబ్రవరి 15: బీపీ పెరిగిన కారణంగా ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కాగా.. అతడి అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌కు చెందిన కిశోర్‌లాల్ (56) సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కోల్ లోడింగ్ కార్మికుడిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. బీపీ పెరిగి మెదడులో రక్తస్రావం జరగడంతో కుటుంబ సభ్యులు అతడిని ఈ నెల 10న హైదరాబాద్ కామినేని ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి వైద్యులు అతడిని వెంటిలేటర్‌పై ఉంచినప్పటికీ చికిత్సకు స్పందించడం లేదు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అవయవదానంపై కిశోర్‌లాల్ కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యులు అంగీకరించి జీవన్‌ధాన్‌కు అంగీకరించారు. కిశోర్‌లాల్ కార్నియా (కండ్లలోని నల్లగుడ్డు), లివర్, రెండు కిడ్నీలు పనిచేస్తాయని వైద్యులు గుర్తించి వాటిని అతడి నుంచి సేకరించారు.

## కోళ్ల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు: కేవీకే

రామవరం, ఫిబ్రవరి 15: కోళ్లపెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే పెంపకందారులు నష్టపోయే ప్రమాదం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీ.లక్ష్మీనారాయణమ్మ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే.రవి అన్నారు. ఆకాశవాణి కిసాన్ దివస్ సందర్భంగా కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ప్రోగ్రాం హెడ్ బైరి శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆకాశవాణి ద్వారా ప్రసారం చేస్తున్న కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని అన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వీ.చైతన్య, పశువైద్యాదికారి డాక్టర్ జీ.ఆనందరావు, కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ కొలిపాక శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.